

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 23.0






కార్తీక శోభ

కార్తీక మాసం తొలిరోజు నరసాపురం వశిష్ఠ గోదావరిలో పుణ్యస్నానాలు.. దీపాలు వదులుతున్న భక్తులు

పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి, భీమవరం సోమేశ్వరస్వామిలకు ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న అర్చకులు.. పెద్ద సంఖ్యలో భక్తులు ఆయా ఆలయాలను దర్శించారు.

అభిషేకాల అనంతరం.. ప్రత్యేక అలంకరణలో పట్టిసం వీరభద్రేశ్వరస్వామి



మీ భూమి కనిపించడం లేదు

రీ సర్వేలో రికార్డులకెక్కని 1,100 ఎకరాలు

- మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయని తొలగించిన రెవెన్యూ అధికారులు
- రికార్డులు లేవంటున్న ముున్సిపాలిటీ
- డ్రోన్‌లు తిప్పేసి హడావుడిగా సర్వే
- ఆరేళ్లుగా ప్రభుత్వానికి ఫిర్యాదులు
- తాడేపల్లిగూడెంలో కనిపించని పరిష్కారం

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

'రీ సర్వేతో రైతుకు భద్రత పెరుగుతుంది. ఎల్పీ నెంబర్లు కేటాయించిన భూములకు ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లకు తావుండదు. భవిష్యత్తులో భూముల రిజిస్ట్రేషన్‌లు ఈ విధంగా జరుగుతాయి' అని నాటి వైసీపీ ప్రభుత్వం చెప్పడంతో అంతా సంతోషించారు. కాని, అదే రీ సర్వే రైతులకు అన్యాయం చేస్తుందని ఏ ఒక్కరూ ఊహించలేదు. హడావుడిగా చేపట్టిన రీ సర్వే తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 1100 ఎకరాలకు చెందిన రైతులు తీరని అన్యాయం చేసింది. పట్టణ పరిధిలోని జువ్వలపాలెం, పెంటపాడు మండలంలోని దర్శిపర్రు రెవెన్యూ భూములు ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కించలేదు. వెబ్‌ల్యాండ్‌లో భూముల వివరాలు కనిపించడంలేదు. ఐదేళ్లుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్య వెళ్లినా పరిష్కారం కాలేదు.



ఎందుకిలా..

తాడేపల్లిగూడెం ముున్సిపాలిటీ ఏర్పడినప్పుడు దర్శిపర్రు పరిధిలోని 1,100 ఎకరాల రెవెన్యూ భూములు దీనిలో విలీనం చేస్తూ ప్రభుత్వం జీవో జారీచేసింది. రెవెన్యూ రికార్డులు దర్శిపర్రులోనే ఉన్నాయి. భూమి పన్నులు పెంటపాడు మండల రెవెన్యూ శాఖకే చెల్లిస్తున్నారు. అవే భూముల్లో లేఅవుట్‌లు వెలిస్తే మాత్రం తమ పరిధిలోకి వస్తాయంటూ ముున్సిపాలిటీ చర్యలు తీసుకుంటోంది. ప్లాన్‌లు దీని పరిధిలోకి వస్తున్నాయి. ఇక్కడ అధికంగా రుసుము చెల్లించాల్సి వస్తుందన్న ఉద్దేశంతో దర్శిపర్రు పంచాయతీలో ప్లాన్‌లు తీసుకుంటున్న వారు ఉన్నారు. పెంటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటున్నారు. ఇలా రైతులు తమ భూములను దర్శిపర్రు పరిధిలో ఉన్నాయంటూ భరోసాతో ఉండేవారు. వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే తర్వాత రైతుల తలరాత తల్లకిందులైంది. తమ వద్ద రికార్డులున్నా దర్శిపర్రు రెవెన్యూ నుంచి 1100 ఎకరాల భూమిని తొలగించారు. అలాగని ముున్సిపాలిటీ రెవెన్యూ పరిధిలోకి వ్యవసాయ భూములు తీసుకురాలేదు. అదే జరిగి ఉంటే తాడేపల్లిగూడెం రెవెన్యూ శాఖ సర్వే నిర్వహించి భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసేది.

డ్రోన్‌పై నెపం

డ్రోన్ తిరగకపోవడంతో సర్వే చేయలేకపోయామని పెంటపాడు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ రికార్డులన్నీ దర్శిపర్రు రెవెన్యూ పరిధిలో ఉన్నాయి. పెంటపాడు తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను నిర్వహిస్తూ వచ్చారు. సర్వే చేయలేదు. అవే భూముల్లో ముున్సిపాలిటీ డ్రోన్ తిప్పింది. కాని, వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయలేదు. పెంటపాడు మండల రెవెన్యూ సిబ్బంది డ్రోన్ తిప్పకపోవడంతో దర్శిపర్రు, జువ్వలపాలెం భూములను సదరు మండలం నుంచి తొలగించారు. ముున్సిపాలిటీ అప్పట్లో డ్రోన్ తిప్పింది. ముున్సిపాలిటీలో సర్వే పూర్తిచేశారు. వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయలేదు. ఎల్పీ నెంబర్‌లు కేటాయించలేదు.

గతంలో దర్శిపర్రు రెవెన్యూ అధికారులే పన్ను వసూలు చేశారు. రీ సర్వే ముందుకొచ్చిన తర్వాత పన్ను వసూళ్లను నిలిపివేశారు. అప్పటి నుంచి రైతులు పన్ను చెల్లించలేని దుస్థితిలో ఉన్నారు. రాష్ట్ర భూపరిపాలన శాఖ కమిషనర్ స్థాయిలో సమస్య పరిష్కారం కావాలి. అక్కడ చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా కలెక్టర్‌పైనే భారం మోపుతున్నారు.

• పథకాలకు నోచుకోని రైతులు

రైతుమిత్ర పథకానికి 1100 ఎకరాలకు చెందిన రైతులు నోచుకోవడం లేదు. పన్ను వసూలు చేయకపోవడంతో సంక్షేమ పథకాలకు రైతులు దూరమయ్యారు. రైతుమిత్రలో ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.20 వేలు చెల్లిస్తోంది. మొదటి విడతగా రూ.7 వేలు జమ చేసింది. జువ్వలపాలెం, దర్శిపర్రు రైతులు ఈ పథకానికి నోచుకోలేదు బ్యాంకుల నుంచి రుణాలు పొందలేకపోతున్నారు. క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. పిల్లల వివాహాలకు జువ్వలపాలెం, దర్శిపర్రు రైతులు భూమి కానుకగా ఇవ్వలేకపోతున్నారు. రిజిస్ట్రేషన్‌లు చేసుకోలేకపోతున్నారు. భూవినియోగ మార్పిడి చేసుకోవాలన్నా అవకాశం లేదు. ఇళ్లు కట్టుకుందామన్నా ఇబ్బందికరంగా మారింది. సమస్య పరిష్కరించాల్సిన అధికారులు నోరెళ్లబెడుతున్నారు. కొత్త సాఫ్ట్‌వేర్ రావాలని చెప్పుకొస్తున్నారు. భూములను రికార్డుల నుంచి తొలగించే ముందు ఇదంతా ఆలోచించాలి. రీ సర్వేను అక్కడ నిలుపుదల చేయాలి. కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చేంత వరకు ఎల్పీ నెంబర్‌లతో కాకుండా ఇప్పుడున్న సర్వే నెంబర్‌లతో కార్యకలాపాలు నిర్వహించాలి. ఆ దిశగానూ అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారు. సమస్యను సృష్టించారు. పరిష్కరించడంలో మాత్రం విఫలమ వుతున్నారు. భూమిని వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించడానికి మళ్లీ కొత్త సాఫ్ట్‌వేర్ రావాలని చెపుతున్నారు. అప్పటి వరకు రైతుల పరిస్థితి ఏమిటో అధికారులకే తెలియాలి.



ప్రైవేట్ గృహాలే పేకాట శిబిరాలు

ఏడాదంతా సంక్రాంతి పండుగే

- క్లబ్‌లు మూసేసినా ఆగని జూదం
- భీమవరం డీఎస్పీపై లెక్కలేనన్ని ఆరోపణలు

భీమవరం క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, పేకాటలు జిల్లాలో జరగడం ఆనవాయితీ. ముందుగా కోర్టు ఆర్డర్ ద్వారా ఎటువంటి జూదాలకు అనుమతులు లేవని పెద్ద ఎత్తున అటు పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు ప్రచారం చేస్తారు. ముందుగా వేసిన కోడి పందేల బరులు ధ్వంసం చేయడం పోలీసులవంతు. అయితే సంక్రాంతి పండుగ నేపథ్యంలోమూడు రోజులపాటు కోడి పందేలు, పేకాట, జూదాలను పెద్దగా పట్టించుకోరు. ఏడాది పొడవునా పేకాటలు ఇప్పుడు సర్వసాధారణమయ్యాయి. గత వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా ఏడాది పొడవునా జూదాలు కొనసాగుతూనే ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక పలు క్లబ్బుల్లో పేకాటలు జరిగేవి. దీనిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలోనూ పేకాటలను నిలిపివేశారు. గుర్తింపు ఉన్న క్లబ్బుల్లోనూ ఆటలు నిలిచిపోయాయి. కొన్నాళ్లపాటు జిల్లాలో అంతా గప్‌చుప్‌గా ఉంది. ఇటీవల మళ్లీ ప్రైవేట్ గృహాల్లో యథేచ్ఛగా పేకాటలు నిర్వహిస్తున్నారు. పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఆశ్చర్యకరం. ఇటీవల భీమవరం సబ్ డివిజనల్ అధికారి ఆర్‌జీ జయసూర్యపై వచ్చిన ఆరోపణలు దీనికి అద్దం పడుతున్నాయి.

పేకాట.. కోడి పందేల జోరు

భీమవరం డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో పోలీసు అధికారే పేకాటకు అనుమతులు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. భీమవరం డివిజన్‌లోని ఓ నియోజకవర్గంలో ఇప్పటికీ కోడి పందేలు నిర్వహిస్తున్నారు. వీటిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేయడంతో డొంక కదిలింది. మామూళ్ల రూపంలో డివిజన్ స్థాయిలో పోలీసు అధికారికి ఏకంగా రూ.20 లక్షలపైనే అందుతున్నట్టు పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. సదరు అధికారి

(మిగతా 8వ పేజీలో)

అవినీతి ఆరోపణలు

- సదరు పోలీస్ అధికారిపై పేకాటల్లో నెల వారీ మామూళ్లు వసూలు చేస్తున్నారని, క్రికెట్ బెట్టింగ్ ముఠాను పట్టుకున్నప్పుడు బుకీల నుంచి డబ్బులు వసూలు చేశారని, ఆకివీడు సర్కిల్ ఆఫీస్‌లో చేసే ఐడీ పార్టీ హెడ్ కానిస్టేబుల్ గంజాయి కేసులో డబ్బులు తీసుకున్నప్పుడు అతనిని తప్పించడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారని ఇలా చాలా ఆరోపణలు ఉన్నాయి.
- గత వైసీపీ ప్రభుత్వంలో గన్నవరం పరిధిలో పోలీస్ అధికారిగా పనిచేసినప్పుడు అక్కడ జరిగిన కొన్ని ఘటనల్లో అప్పటి అధికార పార్టీకి కొమ్ము కాశారని ప్రచారమూ ఉంది.
- భీమవరం టూ టౌన్‌కు చెందిన ఒక రొయ్యల ఎగుమతిదారుడు డబ్బు లావాదేవీల విషయంలో ఇదే పోలీస్ అధికారి ముఖ్యపాత్ర వహించారంటూ గుప్పుమంది. ఇలా ఒకటి కాదు.. రెండుకాదు.. చాలా సివిల్ తగాదాల్లో కూడా తలదూరుస్తూ అందరి నోళ్లలో నానుతున్న అధికారికి ఇప్పుడు కష్టకాలం దాపురించింది.

గిరిజనుల త్యాగమే పోలవరం
పోడు భూములకు పట్టాలివ్వాలి
సీపీఐ కార్యదర్శి నారాయణ 7

ఈ పాలతో ముప్పే
- పాడి పశువులకు నిషేధిత ఆక్సీటోసిన్ ఇంజక్షన్లు
- విచ్చలవిడిగా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు
- మనుషులకు క్యాన్సర్ ముప్పు
- ఆందోళనలో జనం



నాన్ ఆక్వా జోన్‌లో 27,770 ఎకరాలు

గుర్తించిన మత్స్యశాఖ

భీమవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని 27 వేల 770 ఎకరాల చెరువులను ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం అనుమతులు మంజూరుచేసింది. గ్రామ, మండల, జిల్లాస్థాయి సమావేశాలను ఏర్పాటుచేసి జిల్లాలో నాన్ ఆక్వా జోన్‌లోని చెరువులను గుర్తించింది. రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. జోన్ పరిధిలోకి తెచ్చేలా ప్రభుత్వానికి నివేదిక పంపింది. రాష్ట్రస్థాయి కమిటీ ఇటీవల సమావేశమై నాన్ జోన్‌లో వున్న 27,770 ఎకరాలకు ఆమోదముద్ర వేసింది. దీంతో వాటిని రిజిస్ట్రేషన్ చేసుకునే అర్హతను కల్పించింది. జిల్లాలో ఆక్వా జోన్ విస్తరించింది. జిల్లాలో మరో 6,540 ఎకరాల్లో చెరువులు తవ్వుకోవడానికి అనుకూలమంటూ మత్స్యశాఖ ఇచ్చిన నివేదికకు అనుకూలంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో 1,32,792 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. అందులో 1,04,792 ఎకరాలు మాత్రమే ఇప్పటి వరకు ఆక్వా జోన్ పరిధిలో ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మొత్తం చెరువులు జోన్ పరిధిలోకి వచ్చేశాయి. అప్పుడా రిజిస్ట్రేషన్‌కు వెసులుబాటు కలిగింది. చెరువుల రిజిస్ట్రేషన్‌కు మత్స్య శాఖ చర్యలు తీసుకుంది. ఇప్పటి వరకు 60 వేల ఎకరాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరో 72,792 ఎకరాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. లేదంటే విద్యుత్ రాయితీ, ఇతర ప్రయోజనాలు ఉండవంటూ ప్రభుత్వం స్పష్టం చేసింది. రైతులు రిజిస్ట్రేషన్ కోసం ముందుకొస్తున్నారు.

ఉద్యోగులు.. పెన్షనర్లు.. ఆల్ హ్యాపీ!

ఏలూరు అర్బన్/నిడమర్రు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):ఉద్యోగులు, పెన్షనర్లకు కరవు భత్యం(డీఏ/డీఆర్) బకాయిల చెల్లింపులో ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించింది. రెగ్యులర్, రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఒక విడత డీఏ 3.64 శాతం బకాయి ఒకేలా లభించేలా నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు 21 నెలల డీఏ/డీఆర్ బకాయిలను 4 విడతల్లో చెల్లించడానికి జీవో 63 సవరణ ఉత్తర్వులను ఆర్థిక శాఖ విడుదల చేయడంతోపాటు, అక్టోబరు జీతభత్యాల బిల్లులను ఖజానా శాఖకు సమర్పించేందుకు వీలుగా వెసులుబాటు కల్పిస్తూ బుధవారం డీడీవోలు/డీటీవో/ఎస్టీవోలకు ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు జిల్లాలో ఉద్యోగుల అక్టోబరు జీతభత్యాల చెల్లింపు బిల్లులను ట్రెజరీలకు ఇప్పటికే సమర్పించి ఉన్నా లేదా బిల్లులను ఆమోదించినా వాటిని రద్దుచేసి, పెంచిన డీఏకు అనుగుణంగా బిల్లులను సవరించి మళ్లీ అందజేసేలా డీడీవోలకు అవకాశం కల్పిస్తూ ఆర్థికశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పెరిగిన డీఏను నగదు రూపంలో నవంబరు నుంచే అందుకోవడంతోపాటు, 21 నెలల బకాయిలను మూడు విడతల్లో ఉద్యోగులు, పెన్షనర్లకు వెసులుబాటు లభించినట్టయింది.

దంచి కొట్టిన వాన

- వాయుగుండంతో అధికారులు అప్రమత్తం
- తీరం దాటే వరకు అధికారులు స్థానికంగానే ఉండాలంటూ ఆదేశాలు
- సబ్ కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు



భీమవరం టౌన్/నరసాపురం/మొగల్తూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం పశ్చిమపై కొంత ప్రభావం చూపించింది. బుధవారం ఉదయం సూర్యుడు కనిపించినప్పటికి 11 గంటల ప్రాంతం నుంచి వాతావరణం మారిపోయింది. మబ్బులు రావడం, ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. భీమవరంలోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచింది. వాతావరణం మారడంతో చలిగాలులు పెరిగాయి. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్డీవో దాసి రాజు మండలంలో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులంతా స్థానికంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అలాగే 93911 85874 నెంబరుతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో తీరప్రాంతాల్లో పనిచేస్తున్న పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తుఫాన్ తీరం దాటే వరకు గ్రామాల్లోనే ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. సముద్రతీరం వద్దకు ఎవరిని వెళ్లనివ్వద్దని అన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. నరసాపురం, మొగల్తూరు తహసీల్దార్లు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇటు వాయుగుండం హెచ్చరికతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పంట చివరి దశ సమయంలో భారీవర్షాలు, ఈదురు గాలులకు చేతికొచ్చిన పంటను కోల్పోయే ప్రమాదం ఉందన్న భయం రైతాంగంలో నెలకొంది. ఇప్పటికే మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలాచోట్ల నీరు నిలిచింది. డ్రైనేజీల్లోని నీరు బయటకు లాగకపోవడంతో పొలాల్లోని నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ఆక్వా, వరి సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ శాఖల సిబ్బంది అందుబాటులో ఉన్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తమ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ రాజ్‌కిశోర్ తెలిపారు.



కాళ్లలో రాష్ట్రీయ రహదారిపై నిలిచిన వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు.. భీమవరం ప్రధాన రహదారిపై వర్షంలో ప్రయాణాలు





భీమవరంలో సమావేశమైన ఏఎంసీ చైర్మన్‌లు

ఏఎంసీ చైర్మన్‌లకు చెక్ పవర్ లేకపోతే పనులు చేయలేం

భీమవరం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):'రైతులకు చేయూతనిచ్చే పనులు చేసుకుంటూ ముందుకు సాగాలి. గత ప్రభుత్వంలోని కమిటీలు పేరుకే అన్నట్లు కాకూడదు. ఏఎంసీ చైర్మన్లకు చెక్‌పవర్ లేకపోవడంతో కమిటీలో సొమ్ములున్నా వాటిని ఉపయోగించే అవకాశం ఉండడం లేదు. ప్రతి ఏఎంసీలో రూ.7 కోట్ల నుంచి రూ.15 కోట్లు ఆదాయం వస్తుంది. వాటిని వినియోగించే అధికారం చైర్మన్లకు లేదు. కాబట్టి చెక్‌పవర్ ఇవ్వాలి' అని జిల్లాలోని ఏఎంసీ చైర్మన్లు స్పష్టం చేశారు. బుధవారం భీమవరం ఏఎంసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లాలోని ఏఎంసీ చైర్మన్లు హాజరయ్యారు. 20 శాతం సొమ్ము పుంత రోడ్లకు ఉపయోగిస్తే రైతులకు సహకారం అందించినట్లు అవుతుందన్నారు. రైతులకు సహకారం అందించేందుకు కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించి, సమావేశాల ఏర్పాటుకు, ప్రభుత్వానికి ఏదైనా విషయం తెలిపేందుకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా భీమవరం ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాత రామచంద్రరాజు, సభ్యులుగా పాలకొల్లు, తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్లు కోడె విజయభాస్కర్, సీహెచ్ మంగబాయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆకివీడు, నరసాపురం, తణుకు, అత్తిలి ఏఎంసీ చైర్మన్లు బి.వెంకట్రావు, శ్రీమన్నారాయణ, కొండేటి శివ, దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటుకు 50 ఎకరాల భూములు ఎక్కడ ? 7



తీరంలో కార్తీక శోభ

నరసాపురం వలంథర్‌రేవు వద్ద దంపతుల నోములు

నరసాపురంలో భక్తుల పుణ్యస్నానాలు

నరసాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నరసాపురం తీరంలో బుధవారం కార్తీకమాసం కళ నెలకొంది. తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని వలంథర్, అమరేశ్వర, మండలంలోని రాజ్లుంక రేవుల్లో గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం రేవులో పరమశివుడ్ని దర్శించుకున్నారు. గట్టుపై కార్తీక నోములు నోచుకున్నారు. అనంతరం అరటి డొప్పలపై గోదావరిలో దీపాలు విడిచిపెట్టారు. స్థానికులతో పాటు జిల్లా నలుమూలల నుంచి పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు తరలిరావడంతో వలంథర్‌రేవులో సందడి నెలకొంది. గోదావరిలో నీళ్ల లేకపోవడంతో చాలామంది షవర్ కింద స్నానాలు చేశారు. ఇటు రేవులో రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి దీపాలు వెలిగించారు. ఇటు పట్టణ, మండలంలోని శివాలయల్లో శివనామస్మరణ మార్మోగింది. చాలామంది పరవశివుడ్ని దర్శించుకుని అభిషేకాలు చేయించుకున్నారు. పట్టణంలోని అమరేశ్వర, కపిలమల్లేశ్వర, ఏకాంబేశ్వర, మండలంలోని లక్ష్మణేశ్వరం శివాలయాల్లో భక్తులు రద్దీ కనిపించింది. అనేకమంది కార్తీకమాస ఉపవాసాలు అచరించారు. రాత్రి ఆలయాల్లో దీపారాధన చేసి ఉపవాసాలను విరమించారు.



ప్రత్యేక అలంకరణలో భీమవరం గునుపూడి సోమేశ్వరస్వామి



పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల పూజలు



ఆచంటేశ్వరుని ఆలయంలో భక్తులు.. (ఇన్‌సెట్‌లో) స్వామికి క్షీరాభిషేకం

శంభో శంకర..

- వైభవంగా ప్రారంభమైన కార్తీక మాసం పూజలు
- ఆలయాల్లో మార్మోగిన శివ నామస్మరణ
- పాడ్యమి దీపాలు వెలిగించిన భక్తులు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలిరోజు బుధవారం పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో శివ నామస్మరణ మార్మోగింది. స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు కావాల్సిన సౌకర్యాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, పాలకమండలి చైర్మన్ మీసాల రాము మాట్లాడుతూ స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న దాన పథకానికి గాను ఇప్పటి వరకు వచ్చిన విరాళాలు రూ.47.06.539 అని తెలిపారు. క్యాష్‌బుక్‌లో రూ.9.26.105, ఎఫ్‌డీఆర్‌గా రూ.30.00.000, చెక్కుల రూపంలో రూ.7.18.333 నగదుగా రూ.62.101 వచ్చాయని తెలిపారు.

గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో..

భీమవరంటౌన్ : భీమవరంలోని పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామిని దర్శించుకునేందుకు క్యూకట్టారు. మహిళలు పాడ్యమి దీపాలను వెలిగించి కార్తీకమాస దీక్షను చేపట్టారు.

ఆచంటేశ్వరుని ఆలయంలో..

ఆచంట : ఆచంటలో ప్రసిద్ధిచెందిన ఆచంటేశ్వరుని ఆలయం వేకువజాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. రామగుండం చెరువులో భక్తులు పాడ్యమి దీపాలు వెలిగించి అనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, ఆలయ చైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు భగినీ హస్త భోజనం

అన్నాచెల్లెళ్ల పండుగ



ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్తీక శుద్ధ విదియ రోజున ఏ వయస్సులో వారైనా కులమతాలకు అతీతంగా వారి సోదరి చేతి భోజనం భుజించడం ద్వారా అన్నాతమ్ముళ్లకు, అక్కాచెల్లెళ్లలకు ఈ ఏడాదంతా శుభమే జరుగుతుందని పురాణాలు తెలుపుతున్నాయని దీనినే భగినీ హస్తభోజనం అంటారని ఏలూరు రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం అర్చకుడు కిళాంబి మారుతి శ్రీనివాసరామానుజాచార్యులు తెలిపారు. ఈ కార్తీక శుద్ధ విదియ (గురువారం) రోజున తన సోదరి ఎంత దూరాన్న ఉన్నప్పటికీ ఆమె చేతి భోజనం భుజిస్తే శుభాలు కలుగుతాయన్నారు. దీనికి సంబంధించిన పురాణ కథ ఉందని తెలిపారు.

కార్తీక పాడ్యమి రోజు సత్యభామ చేతిలో నరకుడి పీడ విరగడైందని, ఆ రాక్షసుని బాధల నుంచి విముక్తి కల్పించిన సత్యభామను ఇంటి ఆడపడుచుగా ఆనాటి ప్రజలు విదియనాడు సత్కరించారని తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకు కార్తీక విదియనాడు ఆడపడుచులకు, తమ శక్తిమేర కట్నకానుకలు ఇచ్చి సోదరి ఇంట్లో లేదా వరుసకు సోదరి ఇంటిలోనైనా భోజనం చేయడం ద్వారా మంచి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సోదరుడు సోదరికి చీర, జాకెట్టు, పసుపు, కుంకుమ ఇచ్చి తీపి పదార్థాన్ని అందిస్తారు. పురాతన కాలం నుంచి ఈ ఆనవాయితీని కార్తీక విదియనాడు అమలు చేస్తున్నారన్నారు. కార్తీక శుద్ధ విదియ రోజు సోదరి పిండి వంటలు, భోజనం చేసిన వారికి అపమృత్యు దోషం కలుగకుండా ఉండేలా పరమశివుడు వరమిచ్చినట్టు పురాణాల్లో ఉందని వివరించారు.

కిటకిటలాడిన శివదేవుని ఆలయం



ద్వారకాతిరుమల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయం కార్తీకమాసం ప్రారంభరోజు కావడంతో భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయాన్ని, పరిసరాలను పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో అభిషేకాలు జరిపారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలోని ఉసిరిచెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. శివదీక్ష చేపట్టిన పలువురు శివస్వాములు, స్థానికులు, భక్తులతో ఆలయ ప్రాంగణములో కళకళలాడింది.



ద్వారకాతిరుమల శివాలయంలో భక్తులు (ఇన్‌సెట్‌లో) స్వామివారు



మద్ది ఆంజనేయ స్వామికి లక్ష పుష్పార్చన

మద్ది క్షేత్రంలో లక్ష పుష్పార్చన

జంగారెడ్డిగూడెం/పోలవరం : జంగారెడ్డిగూడెం మండలంలోని గుర్వాయిగూడెంలో వున్న మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో కార్తీక మాస మహోత్సవాలను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత ఆలయం వద్ద ఎమ్మెల్యేకి ఈవో ఆర్‌వి.చందన ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్ష పుష్పార్చన : కార్తీక మాసోత్సవాలలో భాగంగా బుధవారం మద్ది ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తికి లక్ష చామంతి పూలతో పుష్పార్చన కార్యక్రమం వేద పండితులు, రుత్వికులచే నిర్వహించారు.



మద్ది క్షేత్రంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

పట్టిసీమలో భక్తుల తాకిడి

పోలవరం : పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. జిల్లాలో నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి పట్టిసీమ శివ క్షేత్రాన్ని దర్శించారు. అర్చకులు స్వామికి బిల్వార్చన భస్మార్చన ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది భక్తులకు అన్నదానం ప్రసాద వితరణ చేశారు. ఈవో మాట్లాడుతూ ప్రతి సోమవారం ఆలయ ఆవరణలో భజన, కోలాట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నవంబరు 11న గోదావరి హారతి జ్వాలాతోరణం, గ్రామసేవ, 15న దేవస్థానంలో లక్ష దీపోత్సవం నిర్వహిస్తామన్నారు.

నేత్రపర్వం.. సుందర గిరిపై సుదర్శన హోమం



సుదర్శన నృశింహ యజ్ఞాన్ని నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువు దీరిన లక్ష్మీనారసింహుని ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం విశేష కార్యక్రమాలు జరిగాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో సుందరీకరించిన యాగశాలలో పుణ్యహ వాచన, కలశస్థాపన నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల నడుమ శ్రీసుదర్శన నృశింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ అనంత మూల మంత్రహోమం జరిగింది. మూలవిరాట్‌కు విశేషద్రవ్యాలతో అభిషేకం, అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో అమెరికన్ వైద్యులు

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని అమెరికన్ వైద్యులు బుధవారం దర్శించుకున్నారు. ఏలూరుకు చెందిన రోషిణి చిన్నతనం నుంచి అమెరికాలో చదువుకుని వైద్యవృత్తిలో స్థిరపడ్డారు. ఈక్రమంలో ఆమె తన స్నేహితులతో కలిసి ద్వారకా తిరుమల క్షేత్రానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.



ఆలయం వద్ద అమెరికన్ వైద్యులు

తక్కువ వ్యవధిలో విద్యుత్ కనెక్షన్

- ఈపీడీసీఎల్ కొత్త విధానం
- దరఖాస్తుతోనే స్థిర చార్జీల వసూళ్లు
- రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా శ్రీకారం


విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ల జారీకి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కొత్త విధానం అమలులోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు కొత్త కనెక్షన్ కావాలంటే దరఖాస్తు సమర్పించిన తరువాత స్థల పరిశీలన చేసి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసేవారు. దానిపై సర్వీస్ లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. తనిఖీకి వచ్చిన అధికారి విచక్షణపై ఈ మొత్తం ఆధారపడి ఉండేది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ లివింగ్‌ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విద్యుత్ వినియోగదారుల చట్టం 2020కి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కొన్ని సవరణలు చేయడంతో ఏపీఈపీడీసీఎల్ కొత్త విధానం తీసుకువచ్చింది. 150 కిలోవాట్ల వరకు కనెక్షన్లకు ఫిక్సిడ్ చార్జీలు నిర్ణయించారు. ఈ మొత్తాన్ని దరఖాస్తుతో పాటు చెల్లిస్తే వెంటనే కనెక్షన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ అయిపోతాయి. దీనివల్ల చాలాతక్కువ సమయంలో విద్యుత్ సదుపాయం లభిస్తుంది. సైట్ ఇన్‌స్పెక్షన్, ఎస్టిమేషన్ వంటివి ఉండవు.

ఎవరికి వర్తిస్తుందంటే..?

ఇప్పటికే విద్యుత్ సదుపాయం ఉన్న ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ఉన్నవారు కొత్త కనెక్షన్ తీసుకుంటే చార్జీలు ఇలా ఉంటాయి.

- గృహ వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,500.
- వాణిజ్య వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,800.. ఆపై ప్రతి అదనపు కిలోవాట్‌కు రూ.2 వేలు చొప్పున తీసుకుంటారు. ఇలా 20 కిలోవాట్ల వరకు లెక్కించి తీసుకుంటారు.
- ఇవికాకుండా కనెక్షన్ లోడ్ చార్జీల (డొమెస్టిక్) కింద సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ చార్జీలు కలిపి 500 వాట్ల వరకు రూ.800, ఆపై 501 నుంచి 1000 వాట్ల వరకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది..
- నాన్ డొమెస్టిక్/కమర్షియల్ కనెక్షన్లకు మొదటి 250 వాట్ల వరకు రూ.600, 251 వాట్ల నుంచి 500 వాట్ల వరకు రూ.1,000 కట్టాలి. ఇలా ఎల్‌టీ-3, ఎల్‌టీ-4, హెచ్‌టీ కనెక్షన్ కోరుకునే వారికి చార్జీలు నిర్ణయించారు.

ముందుగా చెల్లించడంతో తక్షణ సేవలు



స్థిరమైన చార్జీలు ముందుగానే నిర్ణయించడం వల్ల ఎస్టిమేషన్ పేరుతో జాప్యం ఉండదు. విచక్షణ అధికారంతో అంచనాలు పెంచే అవకాశమూ లేదు. ఎవరికి ఎంత విద్యుత్ లోడ్ పడుతుందో లెక్కించుకుని ఆ మేరకు చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. దీని వల్ల తక్షణమే సేవలు అందించగలుగుతాము. ఇదంతా పూర్తి పారదర్శకంగా ఉంటుంది.

- పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్

రూప్‌చంద్ ధర

ధమాల్ !

- డీలా పడ్డ ఆక్వారైతు



కనిష్ఠ స్థాయికి ధర.. కేజీ రూ.80

- మేతలు, లీజులు కూడా రాని చేపల సాగు
- కేజీకి రూ.35 వరకు నష్టం
- జూన్ చివరి నుంచి ధర పతనం ప్రారంభం
- చేపల మేత పంపిణీకి వెనుకాడుతున్న ఫీడ్ కంపెనీలు
- సొమ్ము కడితేనే చేపల మేత దిగుమతి
- అక్కరకు రాని చేపల సాగు

కోస్తా తీర ప్రాంతంలో చేపల సాగులో ప్రధానంగా రూప్‌చంద్ ధర అత్యంత కనిష్టస్థాయికి చేరుకుంది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ ఈ ధర పలకలేదని ఈ ధర వల్ల రూప్‌చంద్ సాగు చేసే రైతులు తీవ్రనష్టాలలో కూరుకుపోతున్నారు. సాగు కష్టమవుతోందని, కనీసం మేతలు, లీజులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. చేపల మేతలు అందించే ఫీడ్ కంపెనీలు సొమ్ము కడితేనే అందిస్తామని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- నిడమర్రు అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

కనిష్ట స్థాయికి రూప్‌చంద్ ధర

ఈ సంవత్సరం జూన్ చివర నుంచి రూప్‌చంద్ ధర పతనం కావడం ప్రారంభమైంది. రైతు వద్ద రూ.114- 115 పలికిన చేప ధర పతనమవుతూ ప్రస్తుతం గత ఐదేళ్లలో కనిష్ఠ స్థాయి రూ.80కు దిగజారింది. ఇప్పుడున్న మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ ధర ఇంకా పతనమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదే జరిగితే గోదావరి, కృష్ణా ఆయకట్టు ప్రాంతంలో ఇకమీదట చేపల చెరువుల జోలికి వెళ్లేలేని పరిస్థితి దాపరిస్తుందని వాపోతున్నారు.

చేప పెంపకంలోనే రూ.15 నష్టం

ఈ సంవత్సరం జూలై ప్రారంభం నుంచి రూప్‌చంద్ చేప ధర పతనం అవుతోంది. ముఖ్యంగా జూన్ 15న కేజీ రూప్‌చంద్ ధర రూ.114 ఉండగా ప్రస్తుతం అక్టోబరుకు రూ.80 కనిష్ఠ ధరకు చేరింది. ఒక కేజీకి సుమారు రూ.40 రైతు నష్టపోతున్నాడు. చేప పెరుగుదలకు కేజీకి రూ.95 నుంచి రూ.100 వరకు రైతుకు ఖర్చు అవుతుండగా లాభం లేకపోగా సుమారు రూ.15 నష్టపోతున్నాడు. ఒక లారీ పది టన్నుల సరుకు పడితే రైతుకు సుమారు రూ.1.5 లక్షలు నష్టం వస్తోంది. ఈవిధంగా ఉంటే రైతు పరిస్థితి ఏమి కావాలని ఆందోళన చెందుతున్నారు. కనీస పెట్టుబడులు రాకపోతే ఎలా అని ఆవేదన చెందుతున్నారు.

వెనుకాడుతున్న ఫీడ్ కంపెనీలు, డీలర్లు

రూప్‌చంద్ చేప ధర కనిష్ఠ స్థాయికి చేరడంతో చేపలు పట్టడానికి రైతుల ముందుకు రావడం లేదు. గత సంవత్సర కాలం నుంచి చేపల చెరువులకు మేతల పెట్టుబడులు పెడుతున్న ఫీడ్ కంపెనీలు, డీలర్లు ఇంకా పెట్టుబడులు పెట్టలేక ఇబ్బందులు పడుతూ వెనుకంజ వేస్తున్నారు. ఫీడ్ కంపెనీలు, డీలర్లు మేతకు అరువులు పెట్టలేక సొమ్ము చెల్లిస్తేనే మేత పంపుతామని చెబుతున్నారు. ఇప్పటికే తాము చాలా సొమ్ము అరువుగా ఇచ్చామని ఇక ఇవ్వలేమని సొమ్ము చెల్లిస్తేనే మేతలు పంపగలమని తేల్చి చెబుతున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల కొకసారి మేత చల్లాల్సి వస్తుందని, ఈవిధంగా అయితే చేప పెరుగుదల వెనక్కి పోతుందని భయాందోళన చెందుతున్నారు.

ధర పతనానికి కారణాలు

- ఇటీవల ముగిసిన దసరా నవరాత్రులు, దీపావళి.. ప్రస్తుత కార్తీక మాసం పండుగల ప్రభావంతో రూప్‌చంద్ ధర తగ్గడానికి కారణమని ట్రేడర్స్ చెబుతున్నారు. మరో రెండు మూడు నెలలు ఇదే పరిస్థితి ఉండవచ్చని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
- ఓ వైపు పెరుగుతున్న చేపల సరుకు టన్నేజి పెరగడంతో మార్కెట్‌పై విపరీతమైన ఒత్తిడి పడుతోంది. మార్కెట్‌కు వస్తున్న సరుకు ఎక్కువగా ఉండడం వల్ల ధర తగ్గుతుంది.
- ఆక్వా రంగం అత్యున్నత స్థాయిలో ఉన్నప్పుడు మేతలు, మందులకు జీఎస్టీ పేరుతో కోట్లలో రాబడి సంపాదించినా ప్రభుత్వం ప్రస్తుతం నష్టాల్లో ఉన్న రైతును ఆదుకోవడానికి ముందుకు రాకపోవడం శోచనీయం .

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి



గత కొంత కాలంగా రూప్‌చంద్ ధర పతనం రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా కేజీ రూప్‌చంద్ ధర రూ.80 నుంచి రూ.82 మధ్య కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక కేజీ రూప్‌చంద్ చేప తయారీకి సుమారు రూ.90-95 వరకు ఖర్చు అవుతుండడంతో రైతు నష్టానికే పట్టుబడులు పట్టాల్సివస్తోంది. ప్రభుత్వం ట్రేడర్స్‌తో చర్చలు జరిపి గిట్టుబాటు ధరకు చర్యలు తీసుకోవాలి.

మేకా వెంకట రమణ, ఆక్వా రైతు, పెదనింద్రకొలను

ఫీడ్ ధరలు తగ్గించాలి



. ఇటీవల కాలంలో ధర బాగా పతనం కావడంతో గిట్టుబాటు కావడం లేదు. ఈ ధరకు కనీసం మేత రేట్లు, లీజులు రావడం లేదు. కరోనా సమయంలో కూడా ఇంత తక్కువ ధర లేదు. డీలర్లు మేతలు అందిలేక పోతున్నారు. ప్రభుత్వ పెద్దలు ఫీడ్ కంపెనీలతో చర్చించి ఫీడ్ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ఒడిశా రాష్ట్రం చెరువుల తవ్వకానికి రైతుకు సబ్సిడీలు అందించి పోత్సహిస్తోంది. ప్రభుత్వం ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని లేకపోతే రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొంది.

- పసుపులేటి వెంకటేశ్వరరావు ఆక్వా రైతు, గణపవరం

మునిసిపల్ కార్మికుల ధర్నా

- నవంబరు మూడు నుంచి నిరవధిక సమ్మెకు సన్నాహం

ఏలూరుటూటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే డిమాండ్ చేశారు. ఏలూరు మునిసిపల్ కార్యాలయం వద్ద బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు 2023 సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఇంజనీరింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు కిశోర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే నవంబరు మూడో తేదీ నుంచి నిరవదిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఉప్పులూరి హేమశంకర్, ఎ.లక్ష్మీఇందిరా, వరప్రసాద్, ఎస్.సుబ్బారావు, నారాయణ రావు, ఎస్‌కే.ఆలీ, కె.శ్రీనివాసరావు, సీహెచ్ అప్పారావు, బంగారు అక్కమ్మ, ధనియాల రమణమ్మ పాల్గొన్నారు.

● భీమవరంటౌన్: మునిసిపల్ కార్మికుల డిమాండ్ల పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, ప్రభుత్వం మొండి వైఖరిని వీడి ఇచ్చిన హామీలను అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. నాయకులు నీలాపు శ్రీను, రెల్ల రాము, బి.సత్యనారాయణ, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



ఏలూరు మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకుల ధర్నా

● తాడేపల్లిగూడెం :మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఓవీ రాజు మండలపర్తి హరీష్, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

● తణుకు: సమస్యలు పరిష్కారం కోరుతూ మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ కె.ఈశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, మునిసిపల్ వర్కర్సు యూనియన్ గౌరవాధ్యక్షుడు బొద్దాని నాగరాజు మాట్లాడుతూ కనీసవేతనం రూ.26వేలు అమలు చేయాలని, 12వ పీఆర్సీ ప్రకటించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మునిసిపాలిటీ విస్తరణకు అనుగునంగా డైలీ వేజ్ కార్మికుల నిష్పత్తి పెంచాలని డిమండ్ చేశారు.



ఎస్జీఎఫ్ స్కూల్ గేమ్స్ ప్రారంభం

పెదవేగి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పెదవేగిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 19ఏళ్ల విభాగం స్కూల్ గేమ్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ పోటీలు రెండు రోజులపాటు జరుగుతాయని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. బాల, బాలికలకు నిర్వహించిన ఈ పోటీల్లో తొలిరోజు లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్, సాఫ్ట్‌బాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యాలయాల నుంచి 1200మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, డీవీఈవో ఈ.శేఖర్‌బాబు, కె.శ్రీనివాసరావు, గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఏవీ.శివప్రసాద్ పాల్గొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటుకు 50 ఎకరాల భూములు ఎక్కడ ?

- ప్రభుత్వ భవనం ఇస్తేనే విశ్వవిద్యాలయ కార్యాలయం ఏర్పాటుకు అవకాశం
- కలెక్టర్ వెట్రిసెల్విని కలిసిన అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ


మహనీయులతో కూడిన చిత్రపటాన్ని కలెక్టర్‌కు బహూకరిస్తున్న ఇన్‌చార్జి వీసీ

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సమీపంలో ఏర్పాటు చేయతలపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీ భవనాల నిర్మాణాలకు అవసరమైన భూముల పరిశీలన, తాత్కాలిక కార్యాలయం, తదితర అంశాలపై బుధవారం విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావు, అధికారులు ఏలూరులో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి చర్చించారు. కలెక్టర్ సూచనల మేరకు గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామవిద్య శిక్షణ కళాశాలకు సమీపంలోవున్న ప్రభుత్వ పోరంబోకు భూములను పరిశీలించారు. అక్కడ ఐదు ఎకరాల భూములే ఉన్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా భూముల విస్తీర్ణం సరిపోవని అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఇదే విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేసినట్టు తెలిసింది. ఏలూరు పరిసరప్రాంతాల్లో పెద్ద విస్తీర్ణంలో ఒకేచోట ప్రభుత్వభూములు అందు బాటులో లేని విషయాన్ని జిల్లా అధికారులు చెప్పినట్టుగా సమాచారం.

ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయ భవనాల నిర్మాణానికి 50 ఎకరాల విస్తీర్ణం గల భూములు అవసరమని, ఆ మేరకు కనీసం 40 ఎకరాలైనా ఉండేలా ఏలూరు సమీపంలో ప్రభుత్వ భూములను కేటాయించాలని విద్యాశాఖ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్‌కు యూనివర్సిటీ అధికారులు విన్నవించనున్నట్టు తెలిసింది. ఇక విశ్వవిద్యాలయ తాత్కాలిక కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేయాలనేదానిపైనా చర్చలు కొనసాగుతాయని చెబుతున్నారు. ఏదైనా ప్రభుత్వ భవనాన్ని ఉచితంగా ఇస్తేతప్ప అద్దె ప్రాతిపదికన బిల్డింగ్‌ను తీసుకుని వర్సిటీ కార్యాలయాన్ని నిర్వహించడానికి ఆర్థిక స్థోమతలేదని అధికారవర్గాలు భావిస్తున్నాయి. అందుతున్న సమాచారం ప్రకారం ఏలూరులో కనీస ఏర్పాట్లు పూర్తయ్యేవరకు ప్రస్తుతానికి యూనివర్సిటీ తాత్కాలిక కార్యాలయాన్ని విజయవాడలోనే ప్రారంభించి, అక్కడి నుంచే రెగ్యులర్ కార్యకలాపాలు కొంతకాలంపాటు జరిగేలా నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఇదిలాఉండగా ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి వచ్చేఏడాది జనవరిలో డిగ్రీ, పీజీ అడ్మిషన్లు ప్రారంభించడానికి వీలుగా యూజీసీ అనుమతి తీసుకునేందుకు వర్సిటీ అధికారుల బృందం ఈ నెలాఖరులో లేదా వచ్చేనెల ఢిల్లీకి వెళ్లనుంది. ఏలూరు సమీపంలో యూనివర్సిటీ ఏర్పాటుకు, అభివృద్ధికి అవసరమైన చర్యలన్నింటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి హామీ ఇచ్చినట్టు ఇన్‌చార్జి వీసీ తెలిపారు. ఆయా రంగాల్లో శతాబ్దాలుగా ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహనీయులతో కూడిన అరుదైన చిత్రపటాన్ని కలెక్టర్‌కు ఇన్‌చార్జి వీసీ బహూకరించారు.

ఏలూరు జిల్లా క్రీడల అధికారిగా అజీజ్ బాధ్యతలు



ఏలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా (డీఎస్‌డీవో)గా ఎస్ఏ అజీజ్ (సిరాజుద్దీన్) బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన అతను గతంలో ఏలూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్‌గా పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన బి.శ్రీనివాస రావు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యాల యానికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి డీఎస్‌డీవోగా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

26న బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు

ఏలూరు రూరల్, అక్టోబరు 22, (ఆంధ్ర జ్యోతి): అంతర జిల్లాల సీనియర్స్ పురుష ల, మహిళల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు ఈనెల 26న నిర్వహిస్తామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, గవ్వా శ్రీనివాస్‌రావు ఓ ప్రకట నలో పేర్కొన్నారు. ఏలూరులోని కస్తూరిబా పాఠశాలలో ఉదయం మహిళల జట్టు ఎంపికలు, తాడేపల్లిగూడెంలోని సరస్వతి విద్యాలయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రత్తిపాడులో మధ్యాహ్నం మూడు గంటల నుంచి పురుషుల జట్టు ఎంపికలు నిర్వహిస్తా మన్నారు. ఎంపికైన జట్లు విశాఖపట్నంలో నవంబరు 7 నుంచి 10వ తేదీ వరకు జరిగే 11వ సీనియర్స్ అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. వివరాలకు ట్రెజరర్ కె.మురళీకృష్ణ 94411 71933 నంబరులో సంప్రదించాలన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):ఏలూరులో నిర్వహించాల్సిన అండర్-14 బాలుర జట్టు ఎంపిక పోటీలు వర్షం కారణంగా వాయిదా వేశామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఈ. అశోక్‌కుమార్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27న తిరిగి ఎంపిక పోటీలు జరుగుతాయని, ఈ మార్పును గమనించాలన్నారు.


జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు శనివారపుపేట జడ్పీ విద్యార్థులు

ఏలూరు రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) :రాష్ట్రస్థాయి జూడో పోటీలకు శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో భాగంగా అండర్-14, 17 బాల బాలికల జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అభిరామ్ హర్ష, శ్రీనివాస్ కల్యాణ్, జాన్సన్, తరుణ్, వెంకట్, మహేష్, జయ రమ్యశ్రీ ప్రతిభ కనబరిచారు. నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను హెచ్‌ఎం ప్రకాశరావు, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ పద్మలత, అభినందించారు.

నవంబరు 4న డీసీసీబీ సమావేశం

ఏలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) సర్వసభ్య సమావేశం నవంబరు 4న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. చైర్మన్‌గా వీరాంజనేయులు బాధ్యతలు స్వీకరించాక ఇదే తొలి సమావేశం. ఇటీవలే డీసీఎంఎస్ మహాజన సభను పూర్తి చేసుకుంది. తాజా డీసీసీబీ సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఆమోదించేందుకు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా తాడేపల్లిగూడెం డీసీసీబీ బ్రాంచి, బజార్ బ్రాంచిల్లో జరిగిన ఆర్థిక అవకతవకలపై అజెండాలో చేర్చినట్లు సమాచారం. సంబంధిత బాధ్యులపై చర్యలకు సిఫారసు చేసే దిశగానే చర్చించి ఆమోదించే అవకాశం ఉంది.

ఈ పాలతో ముప్పే


ఆవులు, గేదెలకు ఇస్తున్న నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్



- పాడి పశువులకు నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు
- విచ్చలవిడిగా విక్రయాలు
- మనుషులకు క్యాన్సర్ ముప్పు

పాడి పరిశ్రమలో నిషేధిత ఆక్సి టోసిన్ ఇంజక్షన్ల వాడకం విపరీతంగా పెరిగింది. పాల దిగుబడి పెంచేందుకు ఆవులకు, గేదెలకు దీనిని ఇస్తున్నారు. లాభాల కోసం పశువుల పెంపకందారులు ఆక్సిటోసిన్ వినియోగాన్ని కొనసాగించడం వల్ల పశువుల ఆరోగ్యంతో పాటు, ప్రజల ఆరోగ్యానికి కూడా ముప్పుగా మారింది.

(తాడేపల్లిగూడెం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి పశ్చిమలో పాలిచ్చే ఆవులు, గేదెలు కలిపి సుమారు 3.75 లక్షలు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో చాలా మంది రైతులు పశువైద్యుల సిఫార్సు లేకుండా వారే ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు పశువులకు చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది వ్యాపారులు గుట్టు చప్పుడు కాకుండా ఈ దందా నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. స్థానికంగా మందు దొరకకపోతే గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, నెల్లూరు వంటి ప్రాంతాల నుంచి అక్రమంగా తీసు కొస్తున్నట్లు తెలిసింది. ఆక్సిటోసిన్ వల్ల తాత్కాలికంగా పాల ఉత్పత్తి పెరిగినా ఆ తర్వాత పశువులు ఎదకు రాకపోవడం, చూడు కట్టకపోవడం, హార్మోన్ల లోపాలు వస్తాయని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చిన్నపిల్లల్లో హార్మోన్ల ప్రభావం ఎక్కువ

ఈ ఇంజక్షన్లు ఇచ్చిన పశువుల పాలను తాగే పిల్లల ఆరోగ్యంపై కూడా దీని ప్రభావం ఎక్కువ చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పిల్లల్లో హార్మోన్ల అసమతుల్యత, థైరాయిడ్ సమస్యలు, చిన్న వయస్సులోనే రజస్వల కావడం, పెద్దల్లో నరాల బలహీ నత, నిద్రలేమి, ఒత్తిడి సమస్యలు వస్తున్నాయని చెబు తున్నారు. పశువులకు ఆక్సిటో సిన్ వల్ల పాలు సహజ సమతుల్యత కోల్పోతాయి. ఈ పాలను మరిగిం చినా, ప్రాసెస్ చేసినా హార్మోన్ల అవశేషాలు పూర్తిగా తొలగవని చెబుతు న్నారు. ఫలితంగా హార్మోన్ల ప్రభావం మనిషి శరీరంలో తిష్టవేస్తుంది.

నిషేధం ఉన్నా యథేచ్ఛగా వాడకం

ఆక్సిటోసిన్ వాడకాన్ని ప్రభుత్వం ఇప్పటికే నిషేధించింది. ఈ మందు విక్రయం, పంపిణీ, నిల్వ చేసిన వారిపై కఠిన చట్టాలను తీసుకొచ్చింది. అయినా వీటిని బేఖాతర్ చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా వాడడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

మనుషులకు క్యాన్సర్ ముప్పు

సాధారణంగా దూడను చూడగానే గేదెకు మిల్క్‌లెట్‌డౌన్ హార్మోన్ విడుదలై పాలు విడుస్తుంది. దూడ చనిపోతే పాలు విడవడానికి గేదె ఇబ్బంది పడుతుంది. అందువల్ల రైతులు దానికి ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇచ్చి పాలు పితుకుతారు. గేదెలకు, ఆవులకు ఆక్సిటోసిన్ ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా వచ్చిన పాలలో సదరు మందు కూడా ఉంటుంది. ఇది మనిషి శరీరంలోకి వెళ్లి తరచూ వాంతులకు గురవడం, కురుపులు, మరికొందరికి క్యాన్సర్ వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పశువులకు కీళ్ల నొప్పివచ్చి, వాటి ఆయుష్షు తగ్గిపోయే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

మినరల్ మిక్చర్‌తో పాల దిగుబడి పెంపు



పాలకోసం రైతులు ఆక్సిటోసిన్ ఇంజక్షన్ ఇస్తున్నారు. ఇది ప్రభుత్వం నిషేధించింది. దీన్ని విక్రయించే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. పాల దిగుబడి పెంపునకు రైతులు మినరల్ మిక్చర్ ఇస్తే నిషేధిత ఇంజక్షన్లను వాడాల్సిన పని ఉండదు. మినరల్ మిక్చర్‌తో పాటు హెర్బల్ గాలెక్ట్ గోక్స్, లెప్టాడిన్ తదితర మందులను వాడటం మంచిది. ఇలాంటి మందులను వాడటం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండదు. పాల దిగుబడి పెరుగుతుంది. పాడి గేదె పొదుగును పరిశుభ్రంగా ఉంచాలి. గోరువెచ్చని నీళ్లతో కడగాలి. పాడిగుడ్డతో మసాజ్ చేస్తే పాలు ఇవ్వడానికి ఇష్టపడుతుంది.

-డాక్టర్ పి. సురేష్, ఏడీ పశుసంవర్ధక శాఖ, తాడేపల్లిగూడెం

గిరిజనుల త్యాగమే పోలవరం

- పోడు భూములకు పట్టాలివ్వాలి
- సీపీఐ కార్యదర్శి నారాయణ


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

బుట్టాయగూడెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలిచ్చి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కేఆర్ పురం ఐటీడీఏ వద్ద పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల త్యాగం వల్లే పోలవరం ప్రాజెక్టు వచ్చిందన్నారు. ప్రాజెక్టు కోసం భూములిచ్చిన గిరిజనులు అప్పులపాలు అవుతుంటే అమరావతికి భూములిచ్చిన రైతులు కోటీశ్వర్లు అవుతున్నారని తెలిపారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినందున నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని కేంద్రమే భరించాలని తెలియజేశారు. గుమ్మడిపల్లి పెదవాగు ప్రాజెక్టు పునర్నిర్మాణానికి తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. అటవీ హక్కుల చట్టాలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆరోపించారు. అనంతరం గిరిజనుల నుంచి అనేక సమస్యలపై స్వీకరించిన వినతులను పీవో కె.రాములు నాయక్‌కు అందజేశారు. నాయకులు డేగా ప్రభాకర్, ఎండీ మునీర్, మన్నవ కృష్ణచైతన్య, కారం దారయ్య, తలసాని రామారావు, చోడెం దుర్గ, బాడిస రాము, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

●ఛలో ఐటీడీఏ ముట్టడికి సీపీఐ పిలుపు నివ్వడంతో బుట్టాయగూడెం మండలంలో 144 సెక్షన్, 30 యాక్ట్ అమల్లో ఉన్నందున ధర్నా, ప్రదర్శన, ముట్టడికి అనుమతి లేదంటూ పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పోలీసులు ఐటీడీఏ కార్యాలయం గేట్లను మూసివేసి మోహరించారు. దీంతో శాంతియుతంగా నిరసన తెలిపి వినతులు అందించారు.

ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా షోలాపూర్ నుంచి అనకాపల్లి వరకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ డివిజన్ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్ నంబర్ 01477 షోలాపూర్ నుంచి అనకాపల్లికి ఈ నెల 24వ తేదీ నుంచి ప్రతి శుక్రవారం నవంబరు 28వ తేదీ వరకూ నడుపుతున్నట్లు తెలిపారు. రైల్ నెంబర్ 01478 అనకాపల్లి నుంచి షోలాపూర్‌కు ప్రతి శనివారం ఈ నెల 25వ తేదీ నుంచి నవంబరు 29వ తేదీ వరకూ నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రెండు రైళ్లు అక్కల్‌కోట్ రోడ్ దూర్దుహనీ, గంగాపూర్, కలబుర్గాయ్, వాడి, యాద్‌గిర్, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్, అనంతపూర్, ధర్మవరం, కదిరి, మదనపల్లి రోడ్డు, పీలేరు, పాకాల, తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, నెల్లూరు, ఒంగోల్, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి స్టేషన్లలో ఈ రైలు ఆగనున్నట్లు తెలిపారు. ఈ రైళ్లల్లో సెకండ్ క్లాస్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ క్లాసులు, జనరల్ సెకండ్ క్లాసు కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

వైసీపీతో విధ్వంసం.. కూటమితో సంక్షేమం

- మంత్రి రామానాయుడు
- రూ. 3.50 కోట్ల పనులకు శ్రీకారం


మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గతంలో వైసీపీ పాలన అంతా విధ్వంసమేనని, నేడు కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం ఏక కాలంలో జరుగుతున్నాయని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం రూ.3.50 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ముందుగా 24, 25 వార్డుల్లో రూ. 28.50 లక్షలతో మంచినీటి సరఫరా పైపులైన్ పనులు, 28వ వార్డు హనుమాన్ కాలనీలో రూ.14.38 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ, రూ.6లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, చంద్రాజీనగర్‌లో రూ.6.35 లక్షలతో, 31వ వార్డులో రూ.17.71 లక్షలతో, 10వ వార్డులో జి+1 కాలనీలో రూ.39లక్షలతో సీసీ రోడ్డు పనులు, హిందూ శ్మశాన వాటికలో రూ.17.50 లక్షలతో మెస్ నిర్మాణం, 2వ వార్డు బ్రాడీపేటలో రూ. 40 లక్షలతో తూర్పు కాపు కళ్యాణ మండపం పునః నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనలో కక్షలు, వేధింపులు, హత్యలు వంటి రాక్షస పాలన సాగిందన్నారు. అందువల్లే ఆ పార్టీకి 11 సీట్లే దక్కి ప్రతిపక్ష హోదా కూడా లభించలేదన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, కర్నేన గౌరు నాయుడు, పెచ్చెట్టి బాబు, జీవీ, తులా రామలింగేశ్వరరావు, జక్కంపూడి కుమార్, కె. కొండ ప్రసాద్, శిడగం సూరి, దుగ్గిన రాము, రవి కుమార్, సీహెచ్. సత్యనారాయణ, పులి మాధవి, పొట్నూరి భవానీ, అప్పన్న, ఎస్తేరు రాణి, ఉన్నమట్ల కపర్థి తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

తణుకు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కారణం ఏమిటో తెలియదు కానీ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. తేతలి గ్రామానికి చెందిన గరగ సాయి తేజ(19) సెల్ ఫోన్లు రిపేరు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వివాహం చేసుకుని పైడిపర్రుకు చెందిన శ్రీవల్లీని వివాహం చేసుకుని భార్యతో జీవిస్తున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా భార్య శ్రీవల్లీ తన తల్లి ఇంటికి పైడిపర్రు, తల్లి తేతలి గ్రామంలోని వారి తల్లిదండ్రుల ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా వున్న సాయి తేజ మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తల్లి గరగ లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు జిల్లా ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె చంద్రశేఖర్ తెలిపారు.

ఎంఈవో కార్యాలయం అటెండర్ మృతి

భీమడోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని చికిత్స పొందుతూ ఎంఈవో కార్యాలయం అటెండర్ బాలిన రామకృష్ణ(42) బుధవారం మృతి చెందాడు.వేగివాడకు చెందిన రామకృష్ణ భీమడోలు మండలం విద్యాశాఖ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 15న విధినిర్వహణలో భాగంగా కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తుండగా భీమడోలు సాయిబాబా గుడి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలైన రామకృష్ణను ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. మృతుడు దివ్యాంగుడు కాగా భార్య రాజ్యలక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్ట్ మృతి

ద్వారకాతిరుమల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్ట్ మృతిచెందాడు. ఏలూరుకు చెందిన కె.సునీల్ కుమార్(42) డెంటల్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం అతను తన సొంత పనులపై దూబచర్లకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన సునీల్ కుమార్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

పాము కాటుకు మహిళ మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు ఒక మహిళ మృతి చెందింది. ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి గ్రామానికి చెందిన ముల్లంగి మంగాయమ్మ(56)ను ఈ నెల 21వ తేదీ రాత్రి పాముకాటు వేయడంతో ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వాచ్‌మన్ అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఒక హాస్టల్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన గంగుల బాబూరావు (62)నిడదవోలులోని హెబ్రోన్ హాస్టల్లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తాను ఈ బాధను భరించలేనని తాను బతకనంటూ మూడ్రోజుల క్రితం వారి బంధువులకు చెప్పినట్టు సమాచారం.మూడ్రోజుల క్రితం అదృశ్యమైన బాబూరావు ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి దగ్గరలో ఆటోనగర్ ఫేజ్ -1 జాతీయ రహదారి ప్రక్కన సర్వీసు రోడ్డు పక్కన పొదల్లో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. అతని మెడపైన తాడుతో బిగించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ బి.నాగబాబు తన సిబ్బందితో బుధవారం ఘటనాస్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని బంధువులు బుధవారం రాత్రి ఏలూరు వచ్చి మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించి గుర్తించారు.

ఆత్మహత్య ఘటనపై ఆకివీడులో దుమారం

- స్నేహితులే విషం తాగించారంటూ బంధువుల ఆరోపణ
- పోలీస్ స్టేషన్ ముందు మృతదేహంతో ఆందోళన
- మార్కురాజే విషం తాగినట్టు వాంగ్మూలం ఇచ్చాడన్న పోలీసులు


ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు


మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు


మార్కురాజు (ఫైల్)

ఆకివీడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య ఘటన ఆకివీడులో తీవ్ర దుమారం రేపింది. ఏ కారణమో తెలియదు కానీ ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకోగా బంధువులు మాత్రం ఇది హత్యేనంటూ రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. గుమ్ములూరుకు చెందిన కొదమ మార్కురాజు(34) చినకాపవరంలో బేకరీ దుకాణం నడుపుతుంటాడు. వ్యాపారం నిమిత్తం ఆకివీడు వచ్చి దుకాణాల్లో సరుకులు తీసుకెళ్తుంటాడు. ఇదే తరహాలో గత నెల 19న దుకాణం బంద్ చేసి మోటారు సైకిల్‌పై ఆకివీడు వెళ్లాడు. రెండ్రోజులైనా మార్కురాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే అదే రోజున చొక్కా చిరిగి ఉండటంతో తామే ఆటో ఎక్కించి ఇంటికి పంపామని, తరువాత ఏం జరిగిందో తమకు తెలియదని స్నేహితులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే అప్పటి నుంచి గాలింపు చర్యలు చేపట్టిన బంధువులకు ఆచూకీ లభించకపోవడంతో గత నెల 24న పోలీసులకు తండ్రి విజయ కుమార్ ఫిర్యాదు చేశాడు. సెల్ నెంబర్ల ఆధారంగా ట్రేస్ చేస్తుంటే విజయవాడ, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ముంబాయి, విజయవాడ, హైదరాబాద్‌లో ఉన్నట్లు చూపిస్తుందని పోలీసులు బంధువులకు తెలిపారు. అయితే ఉన్నట్టుండి దాదాపు నెల తరువాత బుధవారం తెల్లవారు జామున ఆకివీడు లాంచీలరేవు మార్కెట్ దగ్గర మార్కురాజు గడ్డిమందు తాగి ఉండడం చూసిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు.హుటాహుటిన కుటుంబ సభ్యులు, పోలీసులు వచ్చి మార్కురాజును భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చూపించగా మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తీసుకెళ్లమని చెప్పారు. గుంటూరు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పెడన దగ్గర చనిపోవడంతో బంధువులు తిరిగి పోలీస్ స్టేషన్ దగ్గరకు తీసుకొచ్చి జాతీయ రహదారిపై మృతదేహాన్ని పెట్టి ఆందోళనకు దిగారు. సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నాగరాజు బాధితులతో మాట్లాడినా వినిపించుకోకపోవడంతో రెండు గంటల తరువాత గుమ్ములూరు మాజీ సర్పంచ్ కోపల్లె సాయి వచ్చి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని భీమవరం పోస్టుమార్టం తీసుకెళ్లారు. ఏడుగురు స్నేహితులే మార్కురాజుకు గడ్డి మందు తాగించి ఉంటారంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు.అయితే మార్కురాజు గడ్డిమందు తానే తాగానని తమకు చెప్పాడని, వీడియో కూడా ఉందని పోలీసులు చెబుతున్నారు. మార్కురాజు తండ్రి విజయకుమార్ ఫిర్యాదుతో ఎస్ఐ హనుమంతు నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే మార్కురాజుకు పెళ్లి కాలేదు, తల్లిదండ్రులు ఉన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై పని చేస్తున్న ఒక యువకుడికి షాక్ తగలడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. మండవల్లి మండలం మండవల్లికి చెందిన చిగురుపాటి సుకుమార్(24) బుధవారం మధ్యాహ్నం ఆ గ్రామంలో విద్యుత్ స్తంభంపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌నకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు.

ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి మూడు గేదెలు మృతి..

చింతలపూడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండలం వెలగపల్లి గ్రామ సమీపంలోని మొక్కజొన్న ఫ్యాక్టరీ వద్ద బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి గోలి సత్యనారాయణరెడ్డి అనే రైతుకు చెందిన మూడు పాడి గేదెలు మృతి చెందాయి. చేతికి అందే అంత ఎత్తులోనే ఈ ట్రాన్స్‌ఫార్మర్ బిగించి చుట్టూ రక్షణ నిమిత్తం ఎలాంటి కంచె వేయలేదు. దీంతో పశువులకు తీగలు తగిలి మృతి చెందాయని రైతు తెలిపారు. మూడు లక్షల రూపాయలు విలువైన గేదెలు చనిపోవడంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదన చెందుతోంది.

చిట్టీల వ్యాపారి ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):చిట్టీల వ్యాపారం చేస్తున్న ఒక వివాహితకు సకాలంలో సొమ్ము వసూలు కాక ఆర్థిక ఇబ్బందులకు గురైంది. దీంతో మనస్థాపానికి గురై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన గంగిరెడ్డి రాజేశ్వరి(28) కొంత కాలం నుంచి బంధువులు, స్నేహితుల సహకారంతో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తోంది. సమయానికి చిట్టీల సొమ్ము వసూలు కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురైంది. మనస్థాపానికి గురైన ఆమె బుధవారం ఉదయం పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్ర గాయాలపాలైన ఆమెను బంధువులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తడికలపూడి పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలు

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఒక సెక్యూరిటీ గార్డు విధులకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. టి.నర్సాపురానికి చెందిన షామకూరి బాలాజీ(35) ఫైర్ స్టేషన్ సమీపంలో ఒక ఏటీఎం సెంటర్‌కు సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం తన గ్రామం నుంచి విధులకు వెళ్తుండగా ఏలూరు అమీనా పేట పోలీస్ స్కూల్ ఎదురుగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు రిఫర్ చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గాయాలతో పడి ఉన్న ఒక వ్యక్తిని ఆటో డ్రైవర్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన శ్రీను(50) ఏలూరు మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ ఉంటాడు. ఈ నెల 21న గాయాలతో పడి ఉన్న అతడిని ఒక ఆటో డ్రైవర్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న శ్రీను బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడికి మతిస్థిమితం సరిగాలేక అదృశ్యమయ్యాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో ఏలూరు త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు మండలం దాసరిగూడెం గ్రామానికి చెందిన శొంఠి శేషు(20) ఏలూరు సమీపంలోని సత్రంపాడులో ఉన్న జ్ఞాపిక టీవీఎస్ షోరూమ్‌లో పని చేస్తున్నాడు. అతడికి కొంత కాలం నుంచి మతిస్థిమితం సరిగా ఉండడంలేదు. ఈనెల 10న షోరూమ్‌కు వెళ్తున్నాని చెప్పి ఏలూరు వచ్చి అదృశ్యమయ్యాడు. అతడి కోసం గాలించినా ఆచూకీ కానరాకపోవడంతో చివరకు ఏలూరు త్రి టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. సీఐ వి.కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

భీమవరం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):భీమవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం 22వ విడతలో 44 మంది లబ్ధిదారులకు రూ.24,09,992 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అంజిబాబు అందించారు. ఇప్పటి వరకు భీమవరం నియోజకవర్గంలో 365మంది లబ్ధిదారులకు రూ. 3,14,58,350 అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బండి రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వర రావు, జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, యిర్రింకి సూర్యారావు, పొత్తూరి బాపిరాజు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

భీమవరం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వండర్ కిడ్స్ స్కూల్లో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 100 మంది పాలకొల్లు ఆర్ఆర్ హాస్పిటల్లో ఉచిత ఆపరేషన్ చేయగా 180 మందికి కళ్ళ జోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కళ్ళజోళ్ళకు అల్లం రమేష్ వాణి దంపతులు, దొడ్డనపూడి సర్పంచ్ కొల్లి సుబ్బారావు సహాయం అందించారు. స్కూల్ చైర్మన్ రామకృష్ణ, హెడ్ మిసెస్ అల్లు వనజాక్షి కుమారి పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాల్లో అన్నసమారాధనలు

పాలకొల్లు టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):క్షీరా రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే కార్తీక మాసం భక్తులకు నెలరోజుల పాటు ఆలయ సమీపంలోని రేపాకవారి సత్రంలో పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన పథకాన్ని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు బుధవారం ప్రారంభించారు. ముందుగా కాశీ విశ్వేశ్వర, అన్నపూర్ణదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు స్వయంగా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు వడ్డన చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, కూటమి నాయకులు, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, పాలక వర్గ చైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు కొండ్రెడ్డి సూరిబాబు, యు దుర్గ పెద్దిరాజు, పెన్మెత్స శ్రీదేవి, హోతా ప్రవాళ, పినిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమవరం టౌన్:సోమేశ్వరస్వామి ఆలయం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక అన్నసమారాధనను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో స్వామివారిని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు స్వామివారి దర్శనంతోపాటు, అన్నప్రసాదాన్ని అందించటం అభినందించదగ్గ విషయమన్నారు. ఆలయ చైర్మన్ చింతలపాటి బంగార్రాజు, ఈవో డి.రామకృష్ణంరాజు, ధర్మకర్తల సభ్యులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

పెంటపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలని ఎంఈవో-2 టీవీ రామకృష్ణ అన్నారు. బుధవారం ముదునూరు ప్రాథమిక పాఠశాల నెంబర్- 2ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాబోధన పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలన్నారు.

నేడు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి గురువారం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్, స్త్రీలు, చెవి, ముక్కు, గొంతు, గుండె సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీఈకో, అల్ట్రాసౌండ్ పరీక్షలతో పాటు అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు.

తణుకు మండల సమావేశం వాయిదా

తణుకు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):భారీ వర్షం కారణంగా తగినంత మంది (కోరం లేనందున) సభ్యులు హాజరు కాకపోవడంతో బుధవారం జరగవలసిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం వాయిదా పడింది. ఈ విషయాన్ని ఎంపీడీవో ఆర్.లోహిత్ జయసాగర్ తెలిపారు. ఈ సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దాం

భీమవరం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి పిలుపునిచ్చారు. బుధవారం భీమవరంలో పర్యావరణ పరిరక్షణ ప్లాస్టిక్ నిషేధంపై ఏర్పాటు చేసిన బ్యానర్లను ఆవిష్కరించారు. చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు పర్యావరణాన్ని పరి రక్షించడం బాధ్యతగా స్వీకరించాలని కోరారు.

మొగల్తూరులో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

మొగల్తూరు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 7, 15 నుంచి 17 సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్, నమో దుకు ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 30వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు.



కాళ్లలో చెరువును తలపిస్తున్న రోడ్డు

జోరు వాన



ఆచంటలో వర్షం

మొగల్తూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):ఎడతెరిపి లేని వర్షాలు కారణంగా తీర గ్రామాల్లో రహదారులు ఛిద్రంగా మారాయి. ముఖ్యంగా పాఠశాలలకు, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరిచేలు ముంపు బారిన పడటంతో ఇంజన్లు ఏర్పాటు చేసి బయటకు తోడుతున్నారు. గత నాలుగు రోజులుగా సుమారు 70 మీల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి.

కాళ్ల: అల్పపీడన ప్రభావంతో బుధవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. భారీ వర్షానికి రహదారులపై మోకాళ్ళ లోతు పైనే వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాళ్ల గ్రామంలో సినిమా హాల్ సెంటర్, శివాలయం వద్ద రాష్ట్రీయ రహదారి చెరువులను తలపించే విధంగా వర్షపు నీరు నిలిచాయి.

ఆచంట/పెనుగొండ:వాయుగుండం ప్రభావంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం పడింది. ఉదయం కొద్ది మొత్తంలో జల్లులు పడినప్పటికి మధ్యాహ్న సమయంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. వారం రోజులు పాటు ఇదేవిధంగా వర్షాలు కురుస్తాయని వార్తలువస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి చేలు ఈనికదశలో ఉన్నాయి. ఈదురు గాలులకు అవి ఎక్కడ నేల వాలతాయని ఆందోళనతో ఉన్నారు.

ఆకివీడు/ఉండి: ఆకివీడులో డ్రెయిన్లు ఆక్రమణలకు గురై పారుదల లేకపోవడంతో మురుగునీరుతో పాటు వర్షపు నీరు రహదారులు చేరడంతో చెరువులు, కాలువలను తలపించాయి. ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉండిలో రహదారులు, డ్రెయినేజీలు ముంపుబారినపడ్డాయి. ఉండి-భీమవరం జాతీయరహదారిలో వర్షపునీరు చేరుకుంది. వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఉండి నుంచి చెరుకువాడ వరకు వున్న జాతీయరహదారిలో గోతులుపడ్డాయి.

ప్రైవేట్ గృహాలే పేకాట శిబిరాలు

(5వ పేజీ తరువాయి)

ఉభయ గోదావరి జిల్లాల్లో ధనవంతమైన పోలీసు అధికారిగా అంతా చెప్పుకొంటారు. గతంలో భీమవరం టూ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో పనిచేసిన అనుభవం ఉండడంతో ఇక్కడ ఉన్న వారంతా బాగా పరిచయస్తులు. అదే ఇప్పుడు సదరు పోలీసు అధికారికి కలిసి వస్తోందంటూ అంతా కోడై కూస్తున్నారు. ఇటీవల బదిలీ అయినా తన పలుకుబడితో పాటు, స్థానిక నేతల ఆశీస్సులతో తిరిగి యథాస్థానంలోనే కొనసాగుతున్నారు. భీమవరం డివిజన్‌లో పోలీస్ అధికారి సివిల్ తగాదాల్లో తలదూర్చి సొమ్ము చేసుకోవడం వివాదాస్పదం కావడం వల్లే ఇంత వరకు వచ్చిందన్న వాదనలు ఉన్నాయి.

తప్పుచేస్తే చర్యలు తప్పవు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వెళ్లిన ఫిర్యాదులపై విచారణ చేపడుతున్నాం. తప్పు చేస్తే ఎంతటి పోలీస్ అధికారిపైనా అయినా చర్యలు తీసుకుంటామని ఎస్పీ నయీం స్పష్టం చేశారు.









యనమదుర్రు గ్రామంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు.. పాలకొల్లులో స్కాన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల.. తామరాడ గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని..ఎల్‌బీ చర్లలో సిబ్బందితో మాట్లాడుతున్న విప్ నాయకర్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పెనుగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులందరికి అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పల్లెపల్లెకు పితాని కార్యక్రమంలో భాగంగా బుధవారం దేవ, తామరాడ గ్రామాల్లో పర్యటించారు. బహిరంగ సభలో అధికారులతో కలిసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు, తాగునీరు, కుక్కలు సమస్యలను పంచాయతీ సర్పంచ్ కార్యదర్శి అధికారులతో సమన్వయంతో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ, కూటమి శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

ధరణి స్కానింగ్ సెంటర్ ప్రారంభం

పాలకొల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):నేడు వైద్య సేవల్లో స్కానింగ్ విభాగం ఎంతో కీలకమైనదని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలోని పాత రత్నంటాకీస్ వెనుక వీధిలో కానూరి కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ధరణి స్కానింగ్ సెంటర్‌ను బుధవారం మంత్రి డాక్టర్ నిమ్మల ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ) కన్సల్టెంట్ రూంను, పుప్పాల వాసు బాబు రెండవ కన్సల్టెంట్ రూంను ప్రారంభించారు. కార్యక్రమంలో వానపల్లి బాబూరావు, రేడియాలజిస్ట్ డాక్టర్ పుప్పాల శిరీష నాయుడు, చాంబర్ అధ్యక్షుడు కెవిఆర్ నరసింహారావు, డాక్టర్ ఆర్.రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఎస్.బలరామ్, యురాలజిస్ట్ డాక్టర్ కానూరి హరిష్, డాక్టర్ ఎం.సంజయ్, కొమ్మల మురళీ, జీవీ, పి.బాబు, కానూరి లక్ష్మణరావు, కానూరి రాము, కె.రాంప్రసాద్ పాల్గొన్నారు.

సిబ్బంది పారదర్శకంగా పని చేయాలి

నరసాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పనిచేసే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా సేవలందించాలని ప్రభుత్వ విప్ నాయకర్ ఆదేశించారు. బుధవారం ఎల్‌బి చర్ల గ్రామంలో పర్యటించి జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. సచివాలయ సిబ్బందితో సమావేశమై గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గంగా, మాగ్రాజు వలవల నాని, వెన్నానరేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

భీమవరం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. యనమదుర్రు గ్రామంలో సుమారు రూ. 1.80 కోట్లతో సీసీ రోడ్డు పనులకు బుధవారం ఎమ్మెల్యే అంజిబాబు శంకుస్థాపన చేశారు. యనమదుర్రు నుంచి దిరుసుమర్రు గ్రామం వరకు సీసీ రోడ్డు వేయడం జరుగుతుందని, పనులు తొందరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్లు, డ్రెయిన్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ బండి రమేశ్, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్ పర్యటనలతో రాష్ట్రానికి పెట్టుబడులు

తణుకు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు దుబాయ్ పర్యటన, లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటనలో ఆయా దేశాల ప్రతినిధులతో సమావేశమై వచ్చే నవంబరు 14,15 తేదీల్లో విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానించడంతో వీరి పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. పెట్టుబడులు ఆకర్షించేందుకు సీఎం చంద్రబాబు, లోకేశ్‌లు ఇప్పటికే సింగపూర్ పర్యటన చేశారని గుర్తు చేశారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

తణుకు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తణుకు కేంద్ర జిల్లా ఆసుపత్రి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు మూడు నెలలు వేతన బకాయిలు చెల్లించాలని, 41 నెలలు పీఎఫ్ బకాయిలు జమ చేయాలని తదితర డిమాండ్లతో పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ కార్మికులకు ఇస్తున్న వేతనాలే అతి తక్కువ వేతనాలని, అవి కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మికులు పస్తులతో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్మికుల పీఎఫ్ ఖాతాల్లో జమ చేకుండా ఉన్న కాంట్రాక్టరుకు వైద్య, ఆరోగ్య శాఖాధికారులు బిల్లులు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు.

పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

తణుకు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వఆసుపత్రి, వివిధ కూడల్లో సంతకాలు సేకరణ చేశారు. పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నిర్మించి, నిర్వహించాలని నినాదాలు చేశారు.

భీమవరం టౌన్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను తక్షణం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె.ఎన్.వి. గోపాలన్ డిమాండ్ చేశారు. భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పీపీపీకి అప్పగించడాన్ని రద్దు చెయ్యాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ప్రజానీకం ప్రైవేటీకరణను వ్యతిరేకంగా సంతకాలు చేశారు.

ఇరగవరం: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. బుధవారం ప్రజా సంఘాలు సహకారంతో ఇరగవరం మండల కేంద్రంలో సంతకాల సేకరణ నిర్వహించారు. గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామన మునిస్వామి, పిల్లి కోటేశ్వరరావు, ఎం.మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎస్‌డీ విద్యార్థినుల ప్రతిభ

తణుకు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆక్వా ఎంట్రప్రెన్యూర్ షిప్‌పై ఎస్సీఐఎం డిగ్రీ కాలేజీలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలలో తమ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారని కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి చెప్పారు. బుధవారం కళాశాలలో విద్యార్థినులను అభినందించారు. తమ కళాశాలకు చెందిన బి.షణ్ముఖేశ్వరి వెబ్ సెమినార్‌లో ప్రథమ బహుమతి సాధించినట్లు చెప్పారు. పలువురు విద్యార్థినులు వివిధ స్థానాల్లో నిలిచారని వివరించారు.

నేడు పర్వతారోహకులకు అభినందన

భీమవరం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతి పెద్ద హిమాలయ పర్వత శిఖరం నందాదేవి బేస్ క్యాంపు విజయవంతంగా పూర్తిచేసిన పట్టణానికి చెందిన పెన్మెత్స రవిరాజు, కట్టా సత్య వర ప్రసాద్‌లకు గురువారంనాడు యూత్ హాస్టల్స్ ఆధ్వర్యంలో అభినందన సత్కారం ఛాంబర్‌ఆఫ్ కామర్స్‌లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పర్వతారోహణ సాహస కార్యక్రమంలో యువత పాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు.

నీటి పారుదలకు ఆటంకాలు లేకుండా చూడాలి



దేవదాయ అధికారితో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి):ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని నీటి పారుదలకు ఏ విధమైన ఆటంకాలు లేకుండా మునిసిపల్ సిబ్బంది ఎప్పటి కప్పుడు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆక్రమణలను గుర్తించడంతో పాటు, రోడ్డు మార్జిన్లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్ర మించి నిర్మాణం చేపట్టిన భవన యజమానులకు నోటీసులు ఇవ్వాల న్నారు. అనంతరం సోమేశ్వర స్వామి దేవస్థానం ముందు పారిశుధ్య ఏర్పాట్లను పరిశీలించారు. ప్లాస్టిక్ కవర్లను గుర్తించి ఆగ్రహం వ్యక్తంచేశారు.

పశువుల షెడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ఇరగవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):ఆమోదం పొందిన పశువుల షెడ్లు నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ జివికె మల్లికార్జునరావు తెలిపారు. తణుకు, ఇరగవరం, పెనుమంట్ర, అత్తిలి మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమీక్ష సమావేశం ఇరగవరం ఎంపీడీవో కార్యాలయం నందు బుధవారం నిర్వహించారు. ఉపాధి కార్మికుల ఈకేవైసీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు.

12,652 ఎకరాల్లో ఈ-పంట నమోదు

నరసాపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలోని 12,652 ఎకరాల్లో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. నరసాపురంలో 6719, మొగల్తూరులో 618, యలమంచిలి మండలాల్లో 5513 ఎకరాల్లో సార్వా సాగు జరుగుతుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు 33శాతం పైబడి పంట దెబ్బతింటే ఆర్‌బీకే కేంద్ర సిబ్బందికి తెలియజేయాలన్నారు. పంటను పరిశీలించిన తరువాత జరిగిన నష్టంపై నివేదిక అందిస్తారని ఆయన తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి

పెనుగొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):ఆలయాల అభివృద్ధికి ట్రస్టు బోర్డు చైర్మన్‌లు కృషి చేయాలని ఎమ్మెల్యే తనయుడు పితాని వెంకట్ అన్నారు. సిద్ధాంతంలో విజయ గోపాలస్వామి, నందీశ్వరస్వామి, కేదారేశ్వరస్వామి వార్ల ఆలయ నూతన ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. విజయ గోపాలస్వామి ఆలయానికి వాసంశెట్టి దుర్గా ప్రసాద్, నందీశ్వర స్వామి ఆలయానికి నక్కా గణపతి నూతన ట్రస్టు బోర్డు చైర్మన్‌లుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు గుత్తుల లోకేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారులు ముత్యాల సత్యనారాయణ, డి.పుష్పభాను పాల్గొన్నారు.

కరుగోరుమిల్లిలో కోటి సంతకాలు సేకరణ

ఆచంట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):మెడికల్‌కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కరుగోరుమిల్లిలో వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు మాట్లా డుతూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రజా వ్యతిరేకంగా వ్యవహరించి ప్రజల ద్రోహిగా నిలిచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలోమండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, పిల్లి రుద్ర ప్రసాద్, ముత్యాల నాగేశ్వరరావు, ముప్పాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సుడిదోమ నివారణ చేపట్టాలి

గణపవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):పంట చేతికి వచ్చే సమయంలో కురుస్తున్న భారీ వర్షాలకుతోడు సుడిదోమ వరి పంటను ఆశించే అవకాశం ఉన్నందున నిర్మూలన చర్యలు చేపట్టాలని గణప వరం మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్ కోరారు. బుధవారం వీరేశ్వరపురంలో వరిలో సుడిదోమ నివారణకు తీసుకోవల్సిన చర్యలను ఆయన వివరించారు. సుడిదోమ వరిదుబ్బుల అడుగునా నీటిమట్టంపై దుబ్బుల నుంచి రసాన్ని పీల్చటం వలన పంట సుడులుసుడులుగా ఎండిపోతుందన్నారు. అప్పుడప్పుడు వరి చేలను ఆరబెట్టడం వలన సుడిదోమను కట్టడి చేయవచ్చని ఏవో తెలిపారు. అధికారులు సూచించిన మందులు వాడాలని అన్నారు.

క్రైం కార్నర్

ఆరుగురు జూదరుల అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):తాడేపల్లి గూడెం మండలం జగన్నపేటలో కోతాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.21900 నగదు, మూడు మోటారు సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

భీమవరం క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. దుర్గాపురానికి చెందిన పాలెపు గంగాధరరావు ఈ నెల 21వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంపై భీమవరం వస్తుండగా రెడ్డి అండ్ రెడ్డి కార్ల షోరూమ్ వద్ద ఎదురుగా వస్తున్న మరో మోటార్ సైకిల్ గంగాధరరావు వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ రామారావు తెలిపారు.

పాత కక్షలతో దాడి

ఆకివీడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో వ్యాన్ డ్రైవర్‌పై నలుగురు వ్యక్తులు దాడి చేశారు. ఏలూరు జిల్లా యండపల్లి మండలం, కొవ్వాడలంక గ్రామానికి చెందిన నాగేంద్ర బొలెరో వ్యాన్ వేసుకొని ఆకివీడు నుంచి అయి-భీమవరం వస్తుండగా చెరుకుమిల్లి గ్రామానికి చెందిన ఏరిచర్ల అశోక్‌తో పాటు మరో ముగ్గురు కలిసి దాడి చేశారు. నాగేంద్రను ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో జాయిన్ చేయగా మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ హనుమంతు నాగరాజు కేసు నమోదు చేశారు.

ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ యాక్ట్

ఉండి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి):ఇరువురు రౌడీ షీటర్లపై పీడీ యాక్ట్ ప్రయోగించినట్టు ఆకివీడు సీఐ జగదీశ్వరరావు, ఉండి ఎస్ఐ నసీరుల్లా తెలిపారు. ఉండి గ్రామానికి చెందిన నేతల అజయ్ (9 కేసుల్లో నేరస్థుడు), దాసి విజయ్(11కేసుల్లో నేరస్థుడు) ఉండి పరిసర ప్రాంతాలలో కొంతకాలంగా దాడులు, బెదిరింపులు, దోపిడీలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజా భద్రతకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. దీనితో వీరిపై పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక శోభ

కార్తీకమాస పూజలు ప్రారంభం



ఆకివీడులోని మాదివాడలో మల్లేశ్వర స్వామికి అభిషేకం

ఆకివీడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి రోజు బుధవారం శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమ్రోగాయి. భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక మాదివాడ మల్లేశ్వర స్వామి, భీమేశ్వరస్వామి, సాలిపేట అగస్త్యేశ్వరస్వామి,వీరభద్రస్వామి, వెంకట లింగేశ్వరస్వామి, మార్కండేశ్వరస్వామి, ధర్మాపురం శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పెద్దింట్లమ్మ దేవస్థానం దగ్గర కోటి లలితా సహస్రనామ పారాయణం చేపట్టారు. స్థానిక మినీ బైపాస్ రోడ్‌లోని వెంక య్య వయ్యేరు కాలువ గట్టు స్నానాల రేవు దగ్గర మహిళలు దుస్తులు మార్చుకోవడానికి నగర పంచాయతీ అధికారులు మరుగు ఏర్పాటు చేయకపోవడంతో త్రీవర ఇబ్బందులు పడ్డారు.

ఉండి: రాజులపేటలోని చెన్నమల్లేశ్వరస్వామి, ఎన్ఆర్‌పిఅగ్రహారంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ సూవరపు కనకదుర్గ వెంకటాచార్యులు దంపతులు ప్రత్యేక పూజలను చేశారు. ఆలయకమిటి చైర్మన్ రాఘవ స్వామివారిని దర్శించుకున్నారు. కలిసిపూడిలోని శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

మొగల్తూరు:మండలంలోని పలు శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి, మొగల్తూరులోని వనమల్లిఖార్జుని ఆలయం, ముత్యాలపల్లి భువనేశ్వరీ సమేత ముక్తేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే..

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నేటి బాలల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులైన గ్రంథాలయంలో పాఠకులుగా చదివిన ఆరుగురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి లైబ్రేరియన్ వర్ధనపు శాంతి కుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ దుర్గా కిషోర్ పాల్గొని నూతన ఉపాధ్యాయులు వాసర్ల వెంకటేష్, చాపల వెంకట్రాజు, దేవర నందిని విష్ణు ప్రియ, యర్రా మహేశ్వర్, ఎండి జుల్ఫికర్‌అలీ, పామర్తి రంగారావులను సత్కరించారు.

రైతుల అభివృద్ధికి ఏఎంసీ సహకారం

భీమవరం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధికి సహకారం అందించేలా పాలకవర్గం ముందుకు సాగాలని భీమవరం ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాత రామచంద్రరాజు అన్నారు. బుధవారం ఏఎంసీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. రైతులకు ఏఎంసీ ద్వారా అందించాల్సిన పనులు, పుంతరోడ్డు వంటి వాటిపై నిధులు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండి రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దానేశ్వరి ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం



నగదు విరాళం అందిస్తున్న శ్రీరంగనాయకులు

తణుకు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం కోసం అత్తిలి మండలం వరిగేడు గ్రామానికి చెందిన దాత రూ.2 లక్షల విరాళం అందజేశారు. బుధవారం ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మానేపల్లి శ్రీరంగనాయకులు విరాళాన్ని ధర్మకర్తల మండలి చైర్మన్ పత్తి రామకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో మైపాల నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్తలు కేదార్ రాము పాల్గొన్నారు. అనంతరం శ్రీరంగనాయకులను ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ, సభ్యులు సత్కరించారు.

లంకలకోడేరు పీహెచ్‌సీ తనిఖీ

పాలకొల్లు టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యసిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి గీతాబాయి అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీని గీతాబాయి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాఫ్ నర్సు ముత్యవల్లిని రాత్రివేళల్లో ఏఏ కేసులు వస్తున్నాయి. వైద్య సేవలు ఎలా అందిస్తున్నారు అని ప్రశ్నించారు. డాక్టర్ల సమ్మె వల్ల పీహెచ్‌సీలో వైద్యసేవలు అందరికీ అందే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని డాక్టర్ గీతాబాయి తెలిపారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. రాత్రివేళల్లో డెలివరీ కేసులు, పాము కాటు కేసులు, ప్రమాదాల్లో గాయపడిన వారు వస్తే తక్షణమే వైద్యసహాయం అందజేయాలని ఆదేశించారు.

ఏపీఎం ప్రభుదాస్ మృతి



ప్రభుదాస్ (ఫైల్)

మొగల్తూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):మొగల్తూరు ఇందిరా క్రాంతి పథం ఏపీఎం జి.ప్రభుదాస్ (56)మంగళవారం రాత్రి మృతి చెందారు. మొగల్తూరు మండలంలో ఐకేపీ ఏర్పడినప్పుడు సీసీగా ఉన్న ప్రభుదాస్ కొద్దికాలం అనంతరం పదోన్నతిపై పెనుమంట్ర, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో ఏపీఎంగా బదిలీపై వెళ్ళి పని చేశారు. ఏడాది క్రితం తిరిగి మొగల్తూరు వచ్చి విధులు నిర్వహిస్తున్న ప్రభుదాస్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రభుదాస్ మృతి పట్ల మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వనమాల కనకదుర్గ, స్థానిక ఐకేపీ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు